క్లుప్తంగా

నేడు కబడ్డీ టోర్నీ

అలంపూర్: శనివారం నుంచి ఓపెన్ కబడ్డీ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆశన్న, బలగం నాగరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 13, 14 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు దాతలు మొదటి బహుమతి వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు జే.చిన్నయ్య రూ.10,016, రెండో బహుమతి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ డీ రాజు రూ.5,016, మూడో బహుమతి డీ సురేష్ రూ.3,016 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అన్నదాత మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ప్రవేశ రుసుం రూ. 500 చెల్లించాలని తెలిపారు.

వడదెబ్బకు గురవకుండా చర్యలు

మానవపాడు: వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్‌వైజర్ చంద్రన్న సూచించారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఆశా కార్యకర్తలు వడదెబ్బ తగిలిన వారికి తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి పరశురాముడు 3వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలపై పోరాడి, మండలం కోసం కృషి చేసి, కుల వివక్షపై పోరాడిన వ్యక్తి కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన 3వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ముందు పరశురాముడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆశన్న, సీపీఎం అలంపూర్ మండల కార్యదర్శి నరిసింహ, హేమలత, వెంకటేష్, విక్రమ్, సుంకన్న, దేవరాజు, తదితర్లు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులలో మద్యం అమ్మితే చర్యలు

మానవపాడు: బెల్ట్ షాపులలో మద్యం అమ్మితే చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు షాపులలో తనిఖీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులను తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. మద్యం దొరికితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పశువుల నీటితొట్లు



మల్దకల్: మండలంలోని బిజ్వారం, అమరవాయి, బూడిదపాడు, శేషంపల్లి, ఎద్దులగూడెం గ్రామాలలో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో నిర్మించిన ఈ నీటి తొట్లు పశువులకు వేసవి కాలంలో ఎంతో ఉపయోగకరంగా ఉండేవని పశువుల యజమానులు, గ్రామస్తులు తెలిపారు. నీటి తొట్లకు పైపులైను కనెక్షన్ లేకపోవడంతో గ్రామాలలో అవి చెత్తకుండీలుగా మారాయన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లకు పైపులైన్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య మరింత పెంచాలి

మల్దకల్: జాబుకార్డులు ఉన్న కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని గ్రామాలలో వారి సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీఓ హరికృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో 100కు పైగానే కూలీలు పనులు చేసే విధంగా వారికి అవగాహన కల్పించి పనులకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నాటిన మొక్కలకు నీరు అందించి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం

- స్థానిక కొనుగోలు సెంటర్లకు రాని ధాన్యం
- సరిహద్దులో ఉన్న పక్క రాష్ట్రానికే..
- ఇటీవల ప్రారంభమైన ఐకేపీ సెంటర్లు
- కర్ణాటకలో వరికి అధిక ధర
- ఐకేపీ సెంటర్ల వైపు కన్నెత్తి చూడని రైతులు



ధరూరు నుంచి డీసీఎంల ద్వారా రాయచూరుకు తరలిస్తున్న వరి ధాన్యం

ధరూరు: కొనుగోలు సెంటర్లకు వరి ధాన్యం తీసుకొచ్చే నాథులే లేకపోవడంతో కొనుగోలు సెంటర్లు వెలవెలబోతున్నాయి. యాసంగిలో రైతులు సాగు చేసిన వరిపంటను రాయచూర్‌కు తరలించేందుకు మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తమకు గిట్టుబాటు కావడం లేదంటూ రైతులు పక్కనున్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడి వ్యాపారులతో పాటు ఈ ప్రాంత దళారులు రైతుల పొలాల వద్దకే నేరుగా వెళ్లి ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు. వారం రోజులుగా పంట కోత ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో అమ్మకాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయి.

సరిహద్దులోనే కర్ణాటక..

ధరూరు, కేటీదొడ్డి మండలాల సరిహద్దులోనే కర్ణాటక రాష్ట్రం ఉంది. ఎండాకాలంలో నీటి సమస్య ఉంటుందని భావించిన ఈ ప్రాంత రైతులు ముందస్తుగా పంట సాగు చేసుకున్నారు. దీంతో పంట ముందుగానే రైతుల చేతికొచ్చింది. ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యానికి గిట్టుబాటు ధరగా ప్రభుత్వం రూ.2,180గా నిర్ణయించింది. కర్ణాటకలో క్వింటాళ్లు 2,800 నుంచి రకాన్ని బట్టి 2,900 పలకడంతో ఇక్కడి రైతులు పక్కనున్న రాష్ట్రానికి పెద్దఎత్తున ధాన్యాన్ని తరలిస్తున్నారు.

స్పాట్ క్యాష్...

రాయచూరు మార్కెట్‌లో ధాన్యం అమ్మిన వెంటనే డబ్బులు చెల్లిస్తుండడంతో రైతులు అక్కడికే ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. పంట పెట్టుబడి కోసం, రసాయన ఎరువులు, పిచికారీ మందులు ఉద్దెర తెచ్చిన చోట చెల్లించడానికి సులువుగా ఉండడంతో రైతులు అక్కడ అమ్మేందుకు ఇష్టపడ్డారు. అమ్మిన రోజే 2పర్సంట్ తీసుకుని క్యాష్ వెంటనే చెల్లించినట్లు రైతులు చెప్పారు. అదే ధాన్యాన్ని ఇక్కడ అమ్మితే నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెట్టెంపాడు ఎత్తిపోతల కింద తగ్గిన సాగు..

దరూరు మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఏడు రిజర్వాయర్లను నిర్మించారు. వీటి కింద ఏటా రెండు పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా పత్తి, వరి, మిరప, ఇతర పంటలను సాగు చేసుకుంటారు. ఎడారి లాంటి నడిగడ్డ ప్రాంతం నెట్టెంపాడు జలాలతో సస్యశ్యామలం అయ్యిందని చెప్పవచ్చు. గతేడాది అంతంత మాత్రంగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈసారి ఒక పంటకే నీళ్లివ్వడంతో రైతులు బోరు బావులు, ప్రధాన కాల్వ వెంట ఉన్న రైతులు పంటలను సాగు చేసుకుని పంటలు పండించుకున్నారు. మరి కొంత మంది రైతులు నీళ్లందక పంటలు ఎండిపోయాయి.

గతేడాది ఇదే సమయానికి కొనుగోలు చేసిన ధాన్యం

గద్వాల జిల్లాలో మొత్తం 998 మంది రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 48 సెంటర్లకు గాను 35 సెంటర్లలో ధాన్యం కొనుగోలు. ఏ గ్రేడు రకానికి సంబంధించి 6వేల 382 క్వింటాళ్లు, బీ గ్రేడుకు సంబంధించి 101 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. మండలంలోని 18 సెంటర్ల ద్వారా 261.960 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గతేడాది పీఏసీఎస్ ఆధ్వర్యంలో 23 సెంటర్లకు గాను 12 సెంటర్లను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. 762 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.

వడ్లను రాయచూరులోనే అమ్మాను..



నేను రెండెకరాల్లో వరి పంట సాగు చేశాను. నాలుగు రోజుల క్రితమే పంటను కోత కోశాను. ప్రభుత్వం ఇచ్చే ధర కంటే రాయిచూరులో మంచి రేటు వస్తుంది. క్వింటాళ్లకు 2,809 రూపాయలకు అమ్ముకున్నాను. డబ్బులు కూడా వెంటనే చెల్లించారు. పంట సగు కోసం తెచ్చిన అప్పులు కట్టుకున్నాను. పంట చివరి దశలో నటి కొరతతో గింజలు కొంత తాలుపోయింది.

– దావీదు, రైతు, ధరూరు

మద్దతు ధరను పెంచాలి..



రైతులకు ఇచ్చే మద్దతు ధరను ప్రభుత్వం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ధరలను పెంచే దిశ గా చర్యలు తీసుకోవాలి. తద్వారా పక్క రాష్ట్రానికి మన ధాన్యం వెల్లకుండా టుంది. అదే విధంగా ధళారుల నుంచి మోసపోకుండా ఉండేందు కు వీలు ఉంటుంది.

– పొంటన్న, రైతు, ధరూరు

కొనుగోలు సెంటర్లు ప్రారంభించాం..



మండలంలో మొత్తం 18 సెంటర్లను ఈ నెల 4వ తేదీనే ప్రారంభించాం. గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే పక్క రాష్ట్రంలో అధికంగా ధరలు ఉండటంతో రైతులు సెంటర్ల వదక్కకు ధాన్యం తీసుకు రావడం లేదు. రైతులు ధాన్యం తీసుకు వస్తే కొనడానికి సిద్ధంగా ఉన్నాం.

– శోభారాణి, ఐకేపీ ఏపీఎం ధరూరు

సమావేశాలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు నిర్వహించే మండలాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలు జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఈనెల 14న ఉదయం ఉండవెల్లిలో, సాయంత్రం అయిజలో, ఈనెల 15న సాయంత్రం ధరూరు మండలంలోని మదనాపురం క్రషర్ దగ్గర మండల విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు కార్యక్రమాలకు నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, పార్లమెంట్ సభ్యులు హాజరవుతారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహయ్య శెట్టి, గోపాల కృష్ణ, భీమ్‌సేన్‌రావు, భగత్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి గాయాలు



గాయపడిన ఉపాధి కూలీ ఈరన్నగౌడ్

అయిజ: మండలంలోని సంకాపురం గ్రామ శివారులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీ ప్రమాదవశాత్తుకి ఒదపడంతో గాయాలయ్యాయి. ఉపాధి కూలీలు వివరాల ప్రకారం.. శుక్రవారం సంకాపురం గ్రామానికి చెందిన ఈరన్నగౌడ్ చెక్ డ్యాం వద్ద జరుగుతున్న పూడిక తీత పనులకు వెళ్లాడు. పనులు జరుగుతున్న ప్రదేశంలో మట్టి పెల్లమీద నిలబడి పనిచేస్తున్న క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. దీంతో ఆయనకు రెండు చోట్ల కాలు విరిగింది. విషయాన్ని క్షేత్ర సహాయకుడు ఉత్తనూరయ్య, సీనియర్ మేటీ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌కు సమాచారం అందజేశారు. టీఏ అశోక్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన ఈరన్నగౌడ్‌ను కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం ఈరన్నగౌడ్‌ను ఆదుకోవాలని ఉపాధి కూలీలు కోరారు.

ఇసుకకు అనుమతి ఉందా.. ఉత్తిదేనా?



ఇసుకపై కవర్ కప్పకుండా తరలిస్తున్న డ్రైవర్

ఉండవెల్లి: రెవెన్యూ కార్యాలయాలకు సెలవులు వస్తే ఇసుక అనుమతి అదే రోజు ఉంటాయి. అధికారులు ఉండరు. అనుమతి ఉందని ఇసుక దోచేస్తున్నారు. మండలంలో ఇసుక వాహనాలు అధికంగా ప్రయాణిస్తున్నాయి. సెలువులు ఉన్న రోజే ట్రాక్టర్లు అధిక మొత్తంలో ఇసుకను తరలిస్తున్నారు. ఒక్క అనుమతి రసీదు చూపించి పది, పదిహేను వాహనాలు ఇసుకను తరలిస్తున్నాయి. అనుమతి ఒక చోట ఉంటే అమ్మకాలు మరో చోటుకు వెళ్తున్నట్లు ఇసుక బుక్ చేసిన వారు పేర్కొంటున్నారు. ఇసుక అనుమతి తీసుకున్న వారికి ఫోన్ ద్వారా ఓటీపీ వస్తే ఇసుక ట్రాక్టర్ లోడ్ నుంచే ఓటీపీ అడిగి వేరే చోటుకు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. అనుమతి ఉన్న ట్రాక్టర్లను తరలిస్తుండగా అందులో ఇసుకను ఎలాంటి టార్పాలిన్‌తో కప్పకుండా తరలిస్తున్నారు. ఇసుక గాలికి ప్రజల కంట్లో పడి ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకోవాలంటే మహబూబ్‌నగర్ జిల్లా నుంచి టాస్క్‌ఫోర్స్ అధికారులు వచ్చి కేసులు నమోదు చేస్తున్నా, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. నదులు ఖాళీగా ఉండడంతో ఇసుకను తవ్వేస్తున్నారని స్థానిక ప్రజలు చెబుతున్న పట్టించుకోవడం లేదు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు



కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతీ దేవికి అభిషేకం, కుంకుమార్చన చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవిని దర్శించుకున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసుల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలోని పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన నందిన్నె చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని ఆపి క్షుణంగా తనిఖీ చేశారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చి పోయే వాహనాలను పరిశీలించారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నగదును రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు, మద్యం, సార, గుట్కా వంటివి తరలించరాదని ఎవరైన తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు



మధు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిదిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన పూల మధుకు కొంతకాలంగా మతి స్థిమితం సక్రమంగా లేదు. ఈ క్రమంలో ఈ నెల 6న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరికైనా కనిపించినా లేదా ఆచూకీ తెలిసినా ఇటిక్యాల పీఎస్ 8712670282 నెంబర్‌కు సమాచారం అందిచాలని ఎస్ఐ పేర్కొన్నారు.

పంటలు కాపాడుకునేందుకు రైతుల పాట్లు



పంటను కాపాడుకునేందుకు రైతులు చేసుకుంటున్న రక్షణ ఏర్పాట్లు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద బోరుబావుల కింద వరి పంటను సాగు చేసుకున్న రైతులు పంటలు చేతికి వచ్చే దశలో పలు రకాలు పక్షుల వల్ల వాటిల్లుతున్న నష్టంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలపై పక్షులు వాలి గింజలను తినివేస్తుండడంతో వాటి నుంచి రక్షణ కోసం చీరలను రక్షణగా చుట్టుకోవడం, రాత్రివేళలో పెద్దపెద్ద బ్యాటరీ లైట్లను ఉపయోగించి పంట పొలం వద్దనే కావలి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పంట చేతికొచ్చే వరకు పొలం వద్దనే పడిగాపులు కాస్తున్నారు.

ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దు



మద్దూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శాంతినగర్ ఎస్ఐ సంతోష్

శాంతినగర్: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ సంతోష్ అన్నారు. శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరు గ్రామంలో షీ టీమ్ పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సీ-విజిల్ యాప్, ఎన్నికల కోడ్ నియమాలు, ఓటుహక్కు వినియోగించుకోవడంపై శుక్రవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలందరు ఎన్నికల కోడ్ నియమావళి పాటించాలని, గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. రైతులు, ఇతర వ్యాపారాలు చేసేవారు రూ.50 వేలకంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లరాదన్నారు. అంతకు మించి నగదునుగాని, బంగారుగాని రవాణాచేస్తే వాటికి సంబంధించిన బిల్లులు, రశీదులు వెంట తీసుకురావాలన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా ప్రశాంత వాతావరణం చెడగొట్టి గొడవలు సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి నగదు, మద్యం, కానుకలను బహుమతుల రూపంలో ఇవ్వడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే మొబైల్ ఫోన్లో ఫొటోలు, వీడియోలు సీ-విజిల్ యాప్‌లో అప్లోడ్ చేసి ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 100 నిమిషాలలోపు చర్యలు తీసుకుంటారన్నారు. కళా బృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ మాట్లాడుతూ ఓటును ఎవరు డబ్బుకు అమ్ముకోవద్దని, ఓటు ప్రాముఖ్యతను పాటల రూపంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు హన్మంతు, కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు నెట్ ఏర్పాటు



పాన్‌గల్: హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం కోసం ఊరూరా నర్సరీలు పెంచుతన్నారు. వేసవిలో ఎండలు పెరగడంతో మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల రక్షణకు నర్సరీల్లో పచ్చని పందిళ్లు (షెడ్ నెట్) ఏర్పాటు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నీడ ఏర్పాటుతో పాటు రోజు వాటరింగ్ చేస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూర్: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున వడదెబ్బ తగులకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గ్రామీణ వైద్యుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి నిత్యం తాగాలని సూచించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా గొడుగు, వాటర్‌బాటిల్ తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, గ్రామపెద్దలు నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్లన్న, రాంరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ అరుణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

కాలినడక తప్పేదెన్నడో?

- రోడ్డు సౌకర్యం ఉన్నా ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నాగర్‌దొడ్డి నుంచి స్టేజీ వరకు కాలినడకన వస్తున్న మహిళలు

మల్దకల్: ఆ గ్రామాలకు బీటీ రోడ్లున్నాయి. కానీ బస్సులు తిరగవు. గతంలో గ్రామీణ బస్సులను నడిపించిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు బస్సు ఎక్కడం లేదనే సాకుతో వివిధ గ్రామాలకు నడిపిస్తున్న బస్సును అధికారులు అర్ధాంతరంగా నిలుపేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసినా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు 9 ఏళ్ల క్రితం కోటి రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. కుర్తిరావుల చెర్వు నుంచి అయిజ రోడ్డు వరకు, తాటికుంట నుంచి స్టేజీ వరకు, నాగర్‌దొడ్డి నుంచి అయిజ స్టేజీ వరకు, దాసరపల్లి నుంచి బిజ్వారం వరకు, పెద్దపల్లి నుంచి ఎల్కూరు మీదుగా విఠలాపురం మీదుగా అయిజ వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాహనదారులు, అధికచార్జీలు వసూలు చేస్తూ, పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు ప్రతిరోజు 3 కి.మీ.ల మేర కాలినడకన వెళ్లివస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సౌకర్యం లేని బిజ్వారం

బస్సు సౌకర్యం కల్పించాలి



సద్దలోనిపల్లి స్టేజీ నుంచి నేతువానిపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అద్దంలాంటి రోడ్డున్న అద్దాల బస్సులు తిరగకపోవడంతో ప్రతినిత్యం ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

– లవన్న, సద్దలోనిపల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు



మల్దకల్ నుంచి కుర్తిరావులచెర్వు మీదుగా అయిజ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం అయిజ-గద్వాలకు వెళ్లేందుకు 4 కి.మీ.ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలు, కళాశాలల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బుడ్డన్న, కుర్తిరావల్ చెర్వు

బస్సు సర్వీసుల కోసం చర్యలు తీసుకుంటాం..



రోడ్డు సౌకర్యం ఉండి బస్సు సౌకర్యం లేని గ్రామాలను పరిశీలించి బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వెంటనే ఆయా రూట్లకు బస్సు సర్వీసులను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మంజుల, డిపో మేనేజర్, గద్వాల